## 1985 రక్తాక్షి సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

"రండి, రండి...." అంటూ పిడకలు చేస్తున్న రమణమ్మ లేచి నుంచుని, "మీరెళ్ళి కూర్చోండి, ఇప్పుడే వచ్చేస్తాను..." అని, చెయ్యి కడుక్కోవడానికి బావి దగ్గరకు వెళ్ళింది.

పేరయ్యగారు మెట్లెక్కి, వీధి గదిలోకి వెళ్ళి, గోడవారనున్న కొయ్య కుర్చీలో కూర్చుని, చేతినున్న గుడ్డసంచీని గోడకి ఆన్చి పెట్టారు. రమణమ్మ వచ్చే లోపం గదినంతా పరీక్షగా చూడడం, మనసులోనే మెచ్చుకోవడం జరిగిపోయింది.

అది చాలా చిన్న గది. దానికవతల ఇంకొంచెం పెద్దది ఇంకో గది వుంది. వీధి వేపున మరో గదికూడా వుంది. దానికి బయటనుంచి కూడా తలుపు పెట్టించి రమణమ్మ అద్దెకిచ్చిందని ఆయనకు తెలుసు. వున్న ఈ రెండు గదుల్లో రమణమ్మ. ఆవిడ కూతుళ్ళు జానకి, సీత వుంటున్నారు.

ఇంటిముందరా, వెనకా కొంచెం స్థలం వుంది. చుట్టూరా దడికట్టి కాయగూరలు పెంచుతున్నది రమణమ్మ. ఒక పక్కన బొప్పాయి చెట్లు. అరటిచెట్లు వుంటే, ఇంకో పక్కన తోటకూర, పాలకూర, వంకాయలు, బెండకాయలు, పచ్చిమిరప కాయలు, కొత్తిమిర వున్నాయి. పొట్ల, బీర, ఆనప పాదులు ఆవిడ ప్రతి యేడూ పెడుతుంది. ఒక గేదె కూడా వుందావిడకు. భర్తపోయి ఐదారేళ్ళు గడిచి పోయాయి. ఆయన మిగిల్చి వెళ్ళిన మూట ఏమీ లేదు గాని ఎలాగో గుట్టుగా బతుకుతున్నది ఆవిడ. ఇంటినిచూస్తేనే ఆవిడ చాలా జాగ్రత్త మనిషి అని ఇట్టే తెలిసిపోతుంది. శుభ్రంగా అలికిన నేల, ఒబ్బిడిగా సర్దిన సామాన్లు, చక్కగా మడతపెట్టి దండెం మీద వేసిన బట్టలు. బంగారంలా మెరిసిపోతున్న ఇత్తడి గిన్నెలు ఆవిడ స్వభావానికి అద్దం పడుతున్నట్టున్నాయి.

లోపలికొచ్చి, తలుపు దగ్గర నేలమీద కూర్చుంది రమణమ్మ. "మంచినీళ్ళు తెమ్మంటారా బాబూ?" అంటూనే "జానకీ" అని కూతుర్ని కేకేసింది. లోపలి గదిలో కిటికీ దగ్గర కూర్చుని ఏదో నవల చదువుకుంటున్న జానకి లేచి వచ్చింది చల్లటి మంచినీళ్ళతో.

ఈ జానకికి సంబంధంకోసమే ఆయన ఇక్కడికి వస్తూంటారు. జానకి ముద్దబంతి పువ్వులా వుంటుంది. బంగారపు చాయ, పెద్ద పెద్ద కళ్ళు, చక్కని అంగ సౌష్ఠవం, నవ్వితే సొట్టలు పడే నున్నని బుగ్గలు, ఒత్తైన జుట్టు, ఎత్తైన నిలువు.

కాని, ఎంత వెతికినా సరైన సంబంధం దొరకటంలేదు. అలాగని చెప్పటం ఆయనకు లాభించదు. ఇప్పుడాయనకు అర్జంటుగా 15 రూపాయలు కావాలి. ఇంటికి చుట్టాలొచ్చారు. పాలు, కూరగాయలు, బెల్లం, రవ్వ, పంచదార లేకపోతే పరువు పోతుందని భార్య కళ్ళనీళ్ళతో చెప్పింది. పేరయ్యగారు నీళ్ళుతాగి గొంతు సవరించుకునేలోపలే రమణమ్మ అందుకుంది.

"మా అమ్మాయికేమన్నా సంబంధం చూశారా అండీ? క్రితంమాటు ఏలూరులో ఏదో సంబంధం ఉందన్నారు ఏమైంది?"

"అది చాలా మంచి సంబంధమేనమ్మా ఎలాగైనా మనమ్మాయికి కుదిర్చేద్దామని తెగ ఉబలాటపడ్డాను. కాని వాళ్ళు పది వేలన్నా ఇస్తేగాని కుదరదంటున్నారు. నువ్వేమో ఐదువేలకంటే చిల్లిగవ్వ ఎక్కువ ఇవ్వలేనంటున్నావాయె. ఏం చెయ్యమంటావో చెప్పు...."

రమణమ్మ ఏం చెబుతుంది? ఇది చాలా పాత సమస్యే. కూతురి వయసు పెరిగినట్టే కట్నంకూడా రోజురోజుకీ పెరుగుతున్నది. ఇలా అయితే జానకికి తను పెళ్ళిచేసి అత్తారింటికి పంపగలదా? నిరాశతో కుంగిపోయిన రమణమ్మనే చూస్తూ "ఏం ఫర్వాలేదమ్మా. నేనున్నాగా. అమలాపురంలో ఇంకో సంబంధం వుంది. కుర్రాడు ప్రైమరీ స్కూల్లో టీచరుగా చేస్తున్నాడు. చక్కగా వున్నాడనుకో...."

"మరి కట్నం?"

"వాళ్ళు ఐదారు వేలకంటే అడగరని అనుకొంటున్నానేన్నేను. వెళ్ళి మాట్లాడి చూస్తాను. రేపు పంచమి. బయలుదేరుతున్నాను. ఏమంటావ్?"


రమణమ్మకి తలమీద నల్లవెంట్రుకలకంటే తెల్లవే ఎక్కువ వున్నాయి. అన్ని నల్ల వెంట్రుకలూ పూరికే నెరవలేదు. ఆవిడ లోపలికెళ్ళి, ట్రంకు పెట్టెలోంచి రెండు పది రూపాయల నోట్లు తీసి ఆయనకిచ్చింది. "ప్రస్తుతానికిది ఉంచండి బాబూ. పెళ్ళి కుదిరితే మీ కష్టం వుంచుకోను."

పేరయ్యగారొచ్చిన పనిఅయిపోయింది. మరి కాస్సేపు అదీ ఇదీ మాట్లాడి ఆయన లేచారు.

* * *

పేరయ్యగార్ని పంపించి, అరుగుమీద చతికిలబడింది రమణమ్మ. ఆవిడకేమీ తోచడంలేదు. చేతిలో వున్న యాభై రూపాయిలలో ఇరవై రూపాయలు ఎగిరిపోయాయి. పదిహేను రోజులన్నించి ముందరగది కూడా ఖాళీగా వుంటోంది. అందులోకి ఎవరైనా అద్దెకి దిగి వదో, పరకో ఇస్తేగాని ఈనెల గడవడం కష్టం తల వాల్చేసి. నేలనే చూస్తూ చాలాసేపు కూర్చుండిపోయింది రమణమ్మ.

"ఏమండి...ఏమండీ... ఏమండోయ్..!"



ఇన్నిసార్లు పిలిచిన తరువాత గాని ఈ లోకంలోకి రాలేదు రమణమ్మ.

"నా పేరు కృష్ణారావండి. ఇక్కడ జనతా హైస్కూల్లో టీచరుగా వచ్చానండి. హెడ్‌మాస్టారుగారు మీ ఇంట్లో గది ఖాళీగా వుందంటేనూ...."

రమణమ్మకు కృష్ణారావు నచ్చాడు.

అతనికి పాతికేళ్ళుండవచ్చు. చామన ఛాయగా, ఎత్తుగా బలంగా వున్నాడు. వుంగరాల జుట్టు. పెద్ద అందగాడు కాకపోయినా సౌమ్యంగా, చురుకుగా వున్నాడు అనుకుంది. మరో గంటలో కృష్ణారావు గదిలో సామాన్లు సర్దుకుని, గదికి తాళం పెట్టుకుని భోజనానికని హోటల్ వెతుక్కుంటూ బయలు దేరాడు.

* * *

వచ్చిన చిక్కేమిటంటే ఆ పల్లెటూరులో హోటల్ అనేదేమీ లేదు. రెండు టీ కొట్లున్నాయి. నాలుగైదు వేలకంటే జనాభాలేని పల్లెటూరది. ఒక స్కూలు, ఒక ఆస్పత్రి వున్నాయి. వున్నవే రెండు రోడ్లు. మిగతావన్నీ సందులే.

ఆ రోజుకి అరటి పళ్ళు తిని, వేణ్ణీళ్ళలాంటి టీ తాగి నీరసంగా గది కొచ్చాడు కృష్ణారావు.

అతనికి వంట వచ్చు. కాని స్టౌ గాని గిన్నెలు గాని లేవు, సరుకుల్లేవు, ఓపిక అంతకంటే లేదు.

ఇంతలో పక్క గదిలోంచి మెంతులు, ఆవాలు, ఇంగువ తాలింపు వాసన గుప్పుమంది. చాపమీద పడుకుని "ఇది దోసకాయ పచ్చడికా, లేక వెలగపండు పచ్చడికా....లేక అల్లం పచ్చడికా...." అనుకొంటూ నీళ్ళునమిలాడు కృష్ణారావు.

# కలిచేయంచిన త్రీగాలు




సుశీలామూర్తి

వంట కానిచ్చి అడుగుమీదికి చేరిన రమణమ్మ ఆలోచనలో పడింది. "ఈ అబ్బాయి చీకట్లో పడుకున్నాడేం? వంటసామాన్లేం వున్నట్లులేవు. ఎక్కడ తింటాడు?"

"ఇక్కడే తిందూ గాని బాబూ...." అంటే ఎలా వుంటుంది? అతనికి పెళ్ళవలేదని, తమ కులమేనని ఆవిడ భోగట్టా సేకరించింది. అణాపైసా లెక్కపెడుతూ, తీగమీద సాములా సంసారం ఈడ్చుకొచ్చిన రమణమ్మ బుర్ర గబగబా ఆలోచించింది.

ఒకడికి భోజనం పెడితే నెలకు 40, 50 రూపాయలకంటే ఖర్చవదు తనకి. అంటే, ఒక సంవత్సరానికి ఐదారు వందలు. రోజూ ఇక్కడే తిని, ఇక్కడే వుంటే అతనికి తనంటే చనువు, గౌరవం ఏర్పడతాయి. చురుకైన అందమైన జానకి అంటే ఇష్టంకూడా ఏర్పడవచ్చు. ఆరోగ్యంగా వున్నా. చదువుకుని, ఉద్యోగంగల ఈ యువకుడికి భోజనం పెడితే అది లాభసాటిగానే పరిణమిస్తుందని అంతకంతకీ గట్టిపడింది రమణమ్మ మనసులో. ఆవిడ లేచి వెళ్ళి, బంగాళాదుంప వేయించి, మరికాస్త బియ్యం పడేసివచ్చి, కృష్ణారావుని పిలిచింది.

* * *

అసలే ఆకలి మీదున్నాడేమో, ఆవేపుడు కూర, అరటి దూట పచ్చడి, కరివేపాకు మిరియాలతో ఘుమ ఘుమలాడ్తున్న చారు అమృత సమానంగా తోచాయి కృష్ణారావుకి. ఏది ఏమన్నా రోజూ ఇక్కడే భోంచెయ్యాలని అతను గట్టిగా అనుకొన్నాడు పైగా, రమణమ్మ కూడా డబ్బు సంగతి ఏమీ మాట్లాడలేదు.

"పాడు వూరు, ఒక హోటలా ఏమన్నానా?" అని వూరుని తిట్టింది.

"పాపం, వయసులోవున్న పిల్లవాడవు కడుపునిండా తినక పోతే ఎలాగు!" అని

## కాలమ్ దాటని కథ

అవి ఉద్యోగరీత్యా మేము భిలాయిలో క్రొత్తగా కాపురముంటున్న రోజులు. ఒకే బ్లాకులో పది సంసారాలవరకు వుండే వారము. చాలామందికి ప్రాంతీయ భాష తప్ప. మిగతా భాషలు సరిగ్గా రాని క్రొత్త.

ఒకరోజు మా క్రింది ఇంటి తెలుగు స్నేహితురాలు మా తలుపుతట్టి. తను తీసుకువెళ్ళిన గిన్నెలు తిరిగి ఇచ్చేస్తూ. ముక్కు చీదేస్తోంది.

"ఏం. ఏమయింది" అని అడిగాను కంగారుగా.

### టెలిగ్రాం

"టెలిగ్రాం వచ్చింది. మా అక్కకి సీరియస్‌గా వుందిట. నెలలునిండిన మనిషి" అంటూ ఏడ్చేయడం మొదలు పెట్టింది.

"నాకూ సరిగా అనుభవంలేక కాళ్ళు. చేతులు వణకటం మొదలుపెట్టాయి. అయినా మరేం ఫర్వాలేదు. కంగారుపడకండి మీరు" అంటూ ఓదారుస్తూ ఆవిడకి సహాయం చేద్దామని నేనూ క్రిందకి దిగివచ్చాను. అక్కడ మా కన్నడ స్నేహితురాలు కన్పించి అంది!

"అవును పాపం వాళ్ళ నాన్నగారికి సీరియస్‌గా వుందిట. టెలిగ్రాం చూపిస్తే నేనే చదివి చెప్పావంది. వెంటనే నేను ఆవిడకి "మీ అక్కయ్యగారికి కాదు. మీ నాన్నగారికి ఆరోగ్యం బాగాలేదుట. కన్నడంలో "అప్ప" అంటే తండ్రి అని అర్థం అని చెప్పా. వెంటనే ఆవిడ అక్కగారిని వదిలేసి తండ్రికోసం బాధపడడం మొదలు పెట్టింది.

"ఇంతకీ అసలు టెలిగ్రాం ఏది? ఎవరిచేతనయినా మావారికి కబురుచేద్దాం" అంటూ అక్కడున్న ఆడవాళ్ళంతా టెలిగ్రాం అందుకుని చూస్తిమికదా అది ఎదురింటి బ్రహ్మచారికి వచ్చినది. టెలిగ్రాం అతను ఈవిడచేత సంతకం చేయించుకున్నాడు. అందరం ఇక ఆవిడని వదిలేసి అతనికోసం బాధపడుతూ. ఏదో వంట అయిందనిపించాం.

మధ్యాహ్నం భోజనానికి వచ్చిన అతని దగ్గరకి మా వారిని పంపా "పాపం చూసి రండి టెలిగ్రాం వచ్చిందంటూ"

మావారు తిరిగి వచ్చి చెప్పిన విషయం ఏమిటంటే "అది అతను శెలవు కోసం తెప్పించుకున్న టెలిగ్రాం" అని.

—రమణా వేణుగోపాల్

జాలి చూపింది. "నువ్వేం వండుకుంటావులే!" అని పెదవి విరిచింది. "మా ముగ్గురికెలాగూ వండాలి. నీకు ఒక గుప్పెడు బియ్యం వండడం నాకేం కష్టం లేదు." అని భారమంతా తన భుజస్కంధాల మీద కెత్తుకుంది. "మాకూ ఒక మగతోడు. ధైర్యంగా వుంటుంది...." అని. అతను తనింట్లోనే భోజనం చెయ్యడం తనకే సహాయమన్నట్లుగా మాట్లాడింది.

కృష్ణారావుకి ఆవిడ ఆర్థిక పరిస్థితి తెలియను. సునాయాసంగా ఇంకో వయస్కుణ్ణి భరించే శక్తి ఆవిడకి లేనేలేదని అసలే తెలిదు. మగతోడు లేకపోయినా ఈ ఆరేళ్ళు ఆవిడ సంసారాన్ని లాక్కొచ్చిందని అంతకంటే తెలీదు.

"భోజనానికి డబ్బు తీసుకోండి" అంటే అవమానంగా భావిస్తే? లేక. తను ఇవ్వగలిగిన దానికంటే ఎక్కువ అడిగితే? చివరకు. "వస్తురూపేణా ఏదో ఇవ్వచ్చులే" అని నిర్ధారించుకుని అతను నోరు మెదపలేదు.

* * *

ఈ మాటకిప్పుడు సంవత్సరం దాటింది. కృష్ణారావు ఆ గదిలోనే వుంటున్నాడు. పోతే. అంతా ఒకే ఇల్లులా వుంటోంది. మధ్యనున్న తలుపులు ఎప్పుడూ వేయరు. జానకే. కృష్ణారావు గది సర్ది ఊడ్చి గుడ్డపెట్టి తుడిచి శుభ్రంగా వుంచుతుంది. చాకలి వస్తే బట్టలు వేస్తుంది. ఒకోసారి తనే ఉతికి లాండ్రీకి పంపిస్తుంది. ఉత్తరాలొస్తే తీసి జాగ్రత్తగా అందిస్తుంది.

కృష్ణారావుకిది చాలా బాగుంది. కమ్మని భోజనం. రమణమ్మ ఆదరణ. జానకి చలాకీ మాటల కాలక్షేపం. అతనికి రోజులు హాయిగా గడిచిపోతున్నాయి. అతనికున్నదల్లా ఒకే చింత. బడిపంతులవుదామని అతనెన్నడూ అనుకోలేదు యు.పి.ఎస్.సి. పరీక్షలకు వెళ్ళాడుగాని అట్నుంచి ఏ సమాచారమూ లేదు. ఏ ఉద్యోగమూ దొరక్కపోతే ఇందులో చేరాడు.

అతనికున్నదల్లా ఒక మేనత్త మాత్రమే. లక్ష్మమ్మగారికి ఒక్కతేకూతురు శాంతి. బోలెడంత ఆస్తి. ఎంత తమ్ముడు కొడుకైనా వుత్త బి.యస్‌సి. చదివిన. ఆస్తిపాస్తులు. వెనకాముందూలేని కృష్ణారావుకి తన గారాలపట్టినిచ్చి చెయ్యడానికి మనసొప్పక వేరేసంబంధాలు చూడసాగింది. కృష్ణారావుకిది పెద్ద దెబ్బ. చిన్నప్పుడు "నీ పెళ్ళాంరా" అంటూ శాంతిని చూపించి పరాచికాలాడిన ఈ అత్త ఇప్పుడు పరాయి సంబంధం చూస్తోంది. అప్పుడు మావయ్య కొట్టు చిన్నది. ఇప్పుడది పదిరెట్లు పెరిగి లక్షల లాభాలు తెచ్చిపెడుతున్నది. శాంతిని చేసుకుని సుఖంగా వుండొచ్చనను కున్నాడు. ఆ ఆశలన్నీ అడియాసలయ్యాయి. అదే సమయంలో ఈ పల్లెటూరులో వుద్యోగం వస్తే చేరిపోయాడు. శాంతికి వేరొకడితో పెళ్ళయితే చూసే బాధ తప్పిందనుకున్నాడు.

ఇక్కడ జానకి తనకు దగ్గిరవడానికి ప్రయత్నిస్తోంది. రమణమ్మదగ్గర డబ్బేమీ లేదని అతనికిప్పుడు తెలుసు. కాని. జానకి చాలా చక్కనిది. తెలివైనది. మంచి పనిమంతురాలు. ఇలా చూస్తే జానకి కాలిగోటికి సరిపోదు శాంతి. 'తన అందానికి ముగ్ధుడనై చేసుకొన్నాను' అని చెప్పి అత్తయ్య. శాంతిల మొహం మాడ్చేయాలని అతనికి అప్పుడప్పుడు అనిపిస్తూ వుంటుంది. కాని. శాంతితో వచ్చే లక్షలు. సౌకర్యాలు. పరువు ప్రతిష్ఠలు జానకిని చేసుకుంటే రావని కూడా అతను మరువలేదు.

కాని. ఇవేమీ బయటకు పొక్కనీడు కృష్ణారావు. రమణమ్మ. జానకిల దగ్గర అతను చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు. రమణమ్మగారు పెట్టే రుచికరమైన భోజనం. చౌకగా వచ్చిన గది. ఒంటరితనం బాధించకుండా జానకి స్నేహం. వీటిని వదులుకోవాలని అతనికెంతమాత్రం లేదు.

"చూద్దాంలే" అంటూ కాలం గడిపేస్తున్నాడు కృష్ణారావు.

* * *

జానకికి తల్లి ఉద్దేశ్యం తెలుసు. కృష్ణారావు బాగానే వున్నాడు గాని అతడు చేసే వుద్యోగం ఆ పిల్లకు బాగాలేదు. కృష్ణారావు చేసేది ప్రైవేటు స్కూలులో. ఆరువందలకు సంతకం పెట్టించుకుని నెలకు మూడు వందలు మాత్రమే ఇస్తారని కూడా ఆ అమ్మాయి కనిపెట్టింది. పైగా జీవితాంతం ఇదే వూరులో మగ్గిపోవాలి. పెళ్ళయ్యాకైనా ఈ రెండు గదుల ఇంట్లోంచి ఇరికి సందుల పల్లెనుంచి తనకు విముక్తి లభిస్తుందని తను ఎంత కాలంగానో కలలు కంటోంది. కృష్ణారావును చేసుకుంటే ఇదే ఇంట్లో ఇదే వూళ్ళో ఇలాగే జీవితాంతం గడిపెయ్యాలి. ఇదాపిల్లకు ఎంత మాత్రం ఇష్టంలేదు.

ఆ మాటకొస్తే సుబ్బారావుని చేసుకోవడానికి జానకి ఇందుకే ఒప్పుకోలేదు.

సుబ్బారావు వాళ్ళ వూళ్ళోనే వుంటాడు. రమణమ్మకు దూరపు బంధువు కూడా వరుసకి రమణమ్మ భర్త సర్వేశ్వరరావుకి చెల్లెలు కొడుకు. అతను పెద్దగా చదువుకో



ఇటీవల గుంటూరులో జరిగిన జాతీయ జూనియర్ బాలబాలికల జిమ్నాస్టిక్ పోటీలలో ఛాంపియన్‌షిప్ పొంది. శ్రీమతి నాగవేణి వెంగప్ప నుంచి ట్రోఫీలు అందుకుంటున్న పంజాబ్ బాలికల జట్టు. ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు.

లేదు. నాలుగెకరాల పొలంవుంది. స్వంతంగా వ్యవసాయం చేయిస్తున్నాడు. ఐదు వేళ్ళు లోపలి కెళ్ళడానికి ఎట్టి లోటూ లేదుగాని పెద్ద ధనవంతుడేమీ కాదు. బంగారపు బొమ్మలాంటి జానకిని చేసుకోవాలనుంది అతనికి. కాని జానకే ససేమిరా అతన్ని చేసుకోనంది. కావాలంటే తనకంటే ఒకటిన్నర ఏళ్ళు చిన్నదైన సీతనిచ్చి చెయ్యమని తల్లిని బతిమాలింది. నిజం చెప్పాలంటే రమణమ్మ ఆలోచనా అదే. అందమైన జానకిని ఎవరైనా చేసుకొంటారు గాని అతి సాధారణంగా వుండే సీతకు పెళ్ళి చెయ్యడమే కష్టం. తమ ఆర్థిక స్థితిగతులు తెలిసినవాడుగనక సుబ్బారావుకే సీతనిచ్చి చేస్తే బావుంటుందని ఆవిడ లోలోన అనుకొంటున్నది. కాని సుబ్బారావు సీతను చేసుకోవడానికి సుముఖంగా వున్నట్టులేదు.

జానకి, రమణమ్మ లౌక్యాన్నంతా పుణికి పుచ్చుకుంది. తన అందం తన తల్లి బీదరికం ముందు ఓడిపోతుందని. పెళ్ళిళ్ళ బజారులో అందంవిలువ బహు స్వల్పమని ఆమెకు బాగాతెలుసు. పదివేలన్నా పోస్తేగాని తను కలలుకనే కుర్రాడితో పెళ్ళికాదు. పెళ్ళికాకుండా వృద్ధకన్యగా మిగిలిపోవలసిందే లేదా పేరయ్య తెచ్చే ప్రైమరీ స్కూల్ టీచర్‌ని చేసుకోవాలి. లేకపోతే మొరటుగా వుండే సుబ్బారావుని చేసుకుని పొలం పనుల అజమాయిషీచేస్తూ ఈ ఊళ్ళోనే పడుండాలి.

అంతకంటే కృష్ణారావుని చేసుకోవడం గుడ్డిలో మెల్లలా కొంత మెరుగని ఆమె అయిష్టంగానే నిర్ధారించుకుంది.

* * *

ఆ మర్నాడు చెల్లెలి వంట్లో నలతగా వుందని కబురొచ్చి పొరుగూరు వెళ్ళింది రమణమ్మ. కూతుళ్ళు ఇంటిపనీ. గేదెనీ చూసుకోగలరుకనుక మర్నాటికిగాని రానని చెప్పి వెళ్ళింది.

కృష్ణారావు మధ్యాహ్నం భోజనానికి ఇంటికొచ్చి భోంచేసి పోస్ట్ ఆఫీసుకి వెళ్ళొస్తానని బయలుదేరి వెళ్ళాడు. సీత కూడా ఇంట్లో లేదు. అప్పుడే పేరయ్య వచ్చాడు. రమణమ్మలేదని తెలిసి అతను చాలా నిరుత్సాహ పడడం చూసి సంగతేమిటని అడిగింది జానకి. అనుమానిస్తూనే విషయమంతా చెప్పేశాడు పేరయ్య. అమలాపురం కుర్రాడికి వేరేసంబంధం కుదిరింది. హైద్రాబాద్‌లో ఒక సంబంధం వుంది. కుర్రాడు ఆఫీసరు. నెలకు రెండు వేలు జీతం. స్వంత ఇల్లుంది. వేరే బాదరబందీ ఏమీ లేదుగాని. ఇది రెండో సంబంధం. మొదటి భార్య చనిపోయింది. రెండేళ్ళ కూతురుంది. వాళ్ళకి కట్నం అక్కర్లేదు. అమ్మాయి తెల్లగా. అందంగా వుండాలి. అదొక్కటే షరతు.

చెప్పడం అయితే చెప్పాడు గాని పేరయ్యకు భయంగానే వుంది. చదువుకున్న అమ్మాయి. "ఏమిటయ్యా ఇది! ఇలాంటి సంబంధం తెస్తావా!" అని విరుచుకు పడుతుందేమోనని జంకు. కాని. ఈ రోజు సాయంత్రాని కల్లా అతను గుంటూరు వెళ్ళాల్సిన పనివుంది. ఇంకా పది రోజులు దాకారాడు. మళ్ళీ రమణమ్మకోసం రావడం కుదరదు గనక తెగించి చెప్పేశాడు. జానకి ఏమీ మాట్లాడలేదు. "వస్తానమ్మా. అమ్మకు చెప్పు" అని. పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు పేరయ్య.

జానకి బాగా ఆలోచించుకుంది. అన్నివిధాల ఈ హైదరాబాదు సంబంధమే బాగుందని ఆమె నిర్ణయించుకుంది. కాని. ఈ విషయం కృష్ణారావుకెలా చెప్పాలాని ఆమె ఆలోచించసాగింది.

పేరయ్య వెళ్ళిన పది నిమిషాలకు సుబ్బారావు వచ్చాడు. అరుగు మీద నుంచుని ఆలోచిస్తూ చిక్కు తీసుకుంటోంది జానకి నల్లగా నిగనిగలాడుతూ దుమికేజలపాతంలా వుంది విరబోసుకున్న కేశరాశి. పొడుగ్గా. తెల్లగా. అందంగా వున్న జానకిని చూసి సుబ్బారావు గుండె భగ్గుమంది. కృష్ణారావు ఈ వూరికి రాకుండా వుండి వుంటే ఈ అందాలరాసి తన స్వంతమయ్యేదేమో! అమ్మాయిలెప్పుడూ అబ్బాయి అందాన్నే చూస్తారని అతనెక్కడో చదివాడు. తనకి కృష్ణారావులా వుంగరాలజుట్టుగాని. చక్కని ముక్కుగాని. వుద్యోగంగాని లేదు. అందుకే జానకి తనని చేసుకోదు. కృష్ణారావునే చేసుకుంటుంది.

రమణమ్మలేదని తెలిసి గుమ్మంలోంచే వెనుదిరిగిన సుబ్బారావుకి సందు చివర కృష్ణారావు కనిపించాడు. ఒళ్ళు మండిందతనికి. మనసులో వున్నదల్లా కక్కకుండా వుండడం అతని తరం కాలేదు.

* * *

పోస్టాఫీసుకెళ్ళిన కృష్ణారావు గాలిలో తేలుతూ తిరిగొస్తున్నాడు. అసిస్టెంట్ కమర్షియల్‌టాక్స్ ఆఫీసరుగా ఉద్యోగం వచ్చిందతనికి. బంగారుగుడ్లు పెట్టే బాతులాంటిదీ వుద్యోగమని అతను విని వున్నాడు ఇంక ఈ వూళ్ళో వుండాల్సిన పనేంలేదు. రెండు నెలల్లో ఆర్డర్స్ వస్తాయి. ఈ సంగతి తెలిస్తే అత్తయ్య తప్పక మనసుమార్చుకుంటుంది. శాంతి_

## వ్యాసరచన పోటీ

అమరజీవి పొట్టి శ్రీరాములు 84 వ జయంత్యుత్సవాల సందర్భంగా, "కుల తత్వ నిర్మూలన-యువతరం బాధ్యత" అనే అంశంపై తెలుగులో వ్యాసరచన పోటీ నిర్వహించాలని మద్రాసులోని పొట్టి శ్రీరాములు స్మారక కమిటీ నిర్ణయించింది.

ఈ పోటీలో భారత దేశంలోని యువతీ యువకులెవరైనా పాల్గొనవచ్చును. వ్యాసం 8 నుంచి 10 అరటావుల మధ్యలో ఉండాలి. ఈ పోటీ కోసం వ్రాసిన తమవ్యాసాలను మార్చి 5వ తేదీలోగా గౌరవ ప్రధాన కార్యదర్శి, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ బిల్డింగ్, 126, రాయపేట హైరోడ్, మైలాపూర్, మద్రాసు-600 004 చిరునామాకు పంపవలసిందిగా కోరుతున్నారు. ★

# సమాచారమ్

అవతార్ మెహెర్‌బాబా 91 వ జన్మదినోత్సవ సందర్భంగా విజయవాడలో కొత్తపేటలో "మెహెర్-ఎబోడ్" అనే చోట 5-2-85 నుంచి 25-2-85 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.




ఈ సందర్భంగా విజయవాడ మాంటిస్సోరి బి.ఇడి. కళాశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎమ్. వెంకటేశ్వరరావు బాబా దివ్యతత్వం గురించి ఉపన్యసించారు. బీదలకు అన్నదానం, చిన్నపిల్లలచే నృత్య నాటకాలు, భక్తి గీతాల పఠనం కార్యక్రమాలు నిర్వహించారు. ★

శాంతి వెనకనున్న లక్షలు ఇక తనవే!

కాని, రమణమ్మ, జానకిలు ఏమంటారో. వూళ్ళో వాళ్ళుకూడా తను ఆ పిల్లను చేసుకొంటానని అనుకొంటున్నారు. ఎంతోమంది చూచాయగా అడిగారు కూడా. తను ఎన్నడూ ఆ మాటల్ని ధిక్కరించ లేదు. ఇప్పుడిలా వెడతానంటే ఏమంటారో....! తనకింత మంచి వుద్యోగం వచ్చిందన్న సంగతి చెబితే.... అంతే సంగతులు! ఏమైనా సరే, వుద్యోగం సంగతి ఎవ్వరికీ చెప్పకూడదని అతను గట్టిగా అనుకొన్నాడు. ఇంతలో సుబ్బారావు ఎదురై తనను విలన్‌నుచేసి నిందిస్తూ వుంటే, కృష్ణారావుకి చటుక్కున ఒక ఆలోచన వచ్చింది.

అతను ముఖం గంభీరంగా మార్చుకున్నాడు. గొంతులో మంచితనం, విషాదం గుప్పించాడు. "చూడండి, మీరు చిన్నప్పట్నించి జానకిని ప్రేమిస్తున్నారని నాకింతవరకూ తెలీదు. వాళ్ళకు ఎన్నో విధాల సాయపడ్డ మీకు, ఇన్ని ఆశలు పెంచుకున్న మీకు, జానకిని చేసుకోవడానికి నాకంటే ఎక్కువ అధికారం వుంది. నేను మీకడ్డురాను. రేపే నేను విజయవాడ వెళ్ళిపోతాను" అని చెప్పి, నమస్కారం పెట్టి భారంగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు.

స్థాణువై నుంచున్నాడు సుబ్బారావు. "పాపం! ఎంతటి త్యాగశీలి!" అనుకొంటూ. "రేపితను వెళ్ళిపోతాడు. పదిరోజులయ్యాక వచ్చి అడిగితే జానకిని ఇవ్వడానికి రమణమ్మత్త ఒప్పుకోక ఏం చేస్తుంది!" అని. హుషారుగా తనింటికేసి నడిచాడు.

* * *

తెల్లవారుతూనే మొదటి బస్సుకే విజయవాడ వెళ్ళాడు కృష్ణారావు. పదిరోజులయ్యాక తిరిగొచ్చి, వస్తూనే తన పెట్టె, బేడా సర్దుకొన్నాడు. అతను చాలా ఆనందంగా వున్నాడు. శాంతిని చేసుకోమని అత్తయ్య నోరు తెరిచి అడిగింది. ఇప్పుడే వుద్యోగానికి రాజీనామా ఇచ్చేసి వచ్చెయ్యమంది. బట్టలు కుట్టించుకోమని వద్దన్నా రెండు వేల రూపాయలు చేతిలో పెట్టింది. కారులో తీసుకొచ్చి స్టేషనులో బండి ఎక్కించింది.

స్కూలుకెళ్ళాడు కృష్ణారావు. లంచ్ అవర్‌లో, "నేను ఈ సాయంత్రమే వెళ్ళిపోతున్నానండి...." అని అందరి దగ్గరా సెలవు పుచ్చుకొన్నాడు. అందరి మనసులోనూ ఒకేసారి జానకి మెదిలింది. రమణమ్మగారు కృష్ణారావుకి భోజనం పెట్టడంలోని అంతరార్థం వాళ్ళంతా ఊహించకపోలేదు. రేపోమాపో పెళ్ళికి పిలుస్తుందనుకొంటూ వుంటే కథ అడ్డంతిరిగిందే అని కూడా అందరికీతట్టింది. వుండబట్టలేక లెఖ్ఖల టీచరు సుభద్ర అడిగేసింది. "అదేమిటండీ కృష్ణారావుగారూ మీరు ఈ ఊళ్ళోనే పప్పన్నం పెడతారని మేము ఆశపడుతూ వుంటే...."


వాళ్ళేం అడగదలుచుకున్నారో అతనికి బాగా అర్థమైంది. కృష్ణారావు సత్తె కాలపు వాడుకాదు. కలియుగంలో పుట్టి పెరిగినవాడు. అతను తలకొంచెం వంచాడు. గొంతు తగ్గించాడు. మెల్లగా "నిజమేనండి. నేనూ అలాగే అనుకొన్నాను. కాని దేనికైనా పెట్టిపుట్టాలి. మనం ఒకటి తలిస్తే విధి ఇంకొకటి తలుస్తుంది" అన్నాడు.

ఎవరికి ఏమీ అర్థంకాలేదు. కాస్సేపు మౌనంగా వుండి కృష్ణారావే- "మీకు రమణమ్మగారి సంగతి తెలుసుకదా! కానీ కట్నం లేకుండా వాళ్ళమ్మాయిని చేసుకుందామనుకున్నాను. కాని సుబ్బారావని వాళ్ళ బంధువట- అతను ఆ అమ్మాయిని చేసుకుంటానని ముందుకు వచ్చాడు. అతనికి స్వంత ఇల్లుంది. ఆస్తి వుంది. నాకేముందండీ! అనాధను.... అతన్ని చేసుకుంటేనే జానకి సుఖపడగలదు. అందుకే.. సర్లెండి....విష్ యు ఆల్ ది బెస్ట్ ఆఫ్ లక్!" అని చెప్పి జీవం లేని నవ్వొకటినవ్వి. "మిమ్మల్నందరినీ వేడుకుంటున్నాను. నేనెందుకు వెళ్ళిపోతున్నానో ఎవరికీ చెప్పొద్దు. నేనేదో పెద్ద త్యాగం చేశానని అందరూ అనుకోవడం నాకిష్టంలేదు...." అని చెప్పి హెడ్‌మాస్టరుగారి గదికేసి వెళ్ళిపోయాడు.

అందరూ ప్రతిమల్లా కూర్చుండిపోయారు. "పాపం చాలా మంచికుర్రాడు" అంది సుభద్ర కళ్ళొత్తుకుంటూ. "ఇలాంటి త్యాగాలు సినిమాలలోనే వుంటాయనుకొన్నాను" అంటూ బాధపడ్డాడు ఇంగ్లీష్ టీచర్ జయరాం.

* * *

కృష్ణారావు వెళ్ళిపోవడాన్ని గురించి హెచ్. ఎమ్. గారూ, హిందీ టీచరు పరంధామయ్యగారూ చర్చిస్తూ వుంటే అతనే అక్కడికి వచ్చాడు. హెచ్‌మాస్టారు గారు నేరుగా తన మనసులోని విషయానికే వచ్చారు- "నీ రాజీనామా లెటర్ చూశానోయ్!....సరే....చూడు నాయనా....రమణమ్మ విధవరాలు. ఎవరి అండా లేదు వాళ్ళకు, ఆ పిల్ల జానకికి కూడా....సరేలే... అవన్నీ ఎందుకుగాని, కడుపు కొట్టడం నీకు సుఖంకాదు. వాళ్ళ ఆ పేద వాళ్ళ పిల్లనెలాగూ చేసుకోవటం లేదు నువ్వు... పోనీ, నెలకు నూరు రూపాయల చొప్పున




1.200 రూపాయలు నువ్వావిడకిస్తే బావుం టుందని మేమంతా అనుకొంటున్నాము.."

కృష్ణారావు ఆశ్చర్యపోయి విన్నాడు. ఎవరో ఒక పేద విధవరాలికి అన్యాయం జరుగుతోందని ఈ ముసలాయన బాధపడు తున్నాడు. సత్యకాలం ఇంకా వుందన్న మాట! ఇలాంటి ధర్మరాజులు ఇంకా వున్నారన్న మాట!

డబ్బుయిస్తే తనకీ కొంత శాంతిగా.రక్ష ణగా వుంటుంది. కాని. నెలకు నూరు రూపాయలు చాలా ఎక్కువ. ఆవిడ పెట్టిన తోటకూర పులుసు. బచ్చలికూర పప్పుకి అంత డబ్బు ఖర్చవదు. గబగబా గుణించు కుని'నెలకు యాభై ఐతే సరిపోతుందని నిర్ణయించి."నిజమే సార్. కాని నా దగ్గర ఇప్పుడంత డబ్బులేదు. ఇప్పుడు ఈ ఆరు వందలు వుంచండి. తరువాత నెలకు యాభై చొప్పున మీ పేరే పంపుతాను. మీరే ఆవిడకు ఇవ్వండి" అని చెప్పి. డబ్బిచ్చి వెళ్ళిపోయాడు.రమణమ్మకు తనే డబ్బివ్వబోతే ఎన్నో చిక్కులు ఎదుర వ్వచ్చని అతను భయపడ్డాడు. "మిగతా ఆరువందలు ఎలాగూ వంపేదిలేదు! హెచ్. యమ్. గారే ఆ సోదంతా చెప్పు కోనీ...." అని మనసులోనే చిరునవ్వు నవ్వుకొన్నాడు.

* * *

అరగంట తరువాత హెడ్మాష్టారుగారు. పరంధామయ్యగారూ రమణమ్మ ఇంటికి వెళ్ళారు. కాస్సేపు ఊళ్ళో విషయాలు మాట్లాడి చివరకు "కృష్ణారావు ఎందుకో వుద్యోగం వదిలేసి వెళ్ళిపోతున్నాడమ్మా. మాకూ ఇప్పుడే అరగంట క్రితం తెలి సింది...."అన్నారు.

రమణమ్మకు నోటమాట రాలేదు. ఎంత ఆశపెట్టుకుంది తనూ! ఇప్పుడు ఉద్యోగంలేని కృష్ణారావుకి కన్నకూతు రినిచ్చి చేస్తే అతనిన్నీ తనే భరించాల్సి వుంటుంది. ఇంతకాలం భోజనం పెట్టిందే దండుగైంది....ఆవిడ మనసులోని మాట చదివేసినట్టు హెడ్మాష్టరుగారు అన్నారు. "ఇలాంటి గడ్డురోజుల్లో ఒక మనిషికి భోజనం పెట్టడం అంటే మాటలా! పాపం. నువ్వేదో పెట్టేవుగాని....అతనికేం. జీత మంతా దాచుకునుంటాడు. ఒక సంవత్సరం వున్నాడేమో మీ ఇంట్లో. వెళ్ళిపోయే ముందు ఓ వెయ్యి రూపాయలు నీకిమ్మని



Chhaya/PP/415

అతనికి చెప్పాలనుకుంటున్నాం. న్యాయం మాట అది ఏమంటావు ?"

రమణమ్మకి అదృష్టం అనుకోనిదే.... "నెలకు 80రూపాయలుగాలెక్క కట్టారన్న మాట! జానకితో అతనికిపెళ్ళిలాగూకాదు. కనీసం ఈ డబ్బైనా వస్తే కొంత నయం! ఆమె చేతులెత్తి దణ్ణంపెట్టి "ధర్మమూర్తులు మీరు" అంది ఎంతోనిజాయితీగా. "కృష్ణారావు నీకిచ్చిన డబ్బుతో పరంధామయ్య బాకీ మూడొందలు తీర్చేయి రమణమ్మా. అతను పిల్లాపాపా వున్నవాడు, ఇంకో ఏడాదిలోరిటైర్ అవుతున్నాడు ఏం?"రమణమ్మ త్వరత్వరగాఆలోచించింది. ఆవిడబాకీరెండు వందలే. వడ్డీ కలిపినామూడొందలు అయి వుండదు. కాని. అలాగని వాదిస్తే అసలుకే మోసంరావచ్చు. హోటల్‌వాళ్ళలా "ఇంత డబ్బియ్యి" అని కృష్ణారావుని తను నిల దీసి అడగటం కష్టం. తను అడగక్క ర్లేకుండా హెడ్మాస్టరులాంటి పెద్దాయన అడిగితే పని జరిగిపోతుంది. వందరూపాయలు నష్టమైనా ఇంకా చాలా లాభమే! "అలాగేనండి బాబూగారూ" అని మాటిచ్చిందావిడ. "నీపనిచేసిపెట్టానుచూశావా?" అన్నట్టు పరంధామయ్యకేసి చూశారు హెడ్మాస్టరుగారు. ఎప్పుడో నీళ్ళొదులుకున్న ఆ రెండువందల అప్పు మూడు వందలై తిరిగి చేతికందబోవడం బ్రహ్మానందంగా వుంది పరంధామయ్యకు. కాని. ఏదోవిధంగా బదులుతీర్చేలా చేసే దిట్ట తన హెడ్మాస్టరు అని కూడా అతనికి తెలుసు.

* * *

ఆ సాయంత్రం కృష్ణారావుని రైలెక్కించి ఇంటికి తిరిగొచ్చారు. ధర్మరాజులాంటి హెడ్ మాస్టర్‌గారు. ఆయనకు చాలా అలసటగా వుంది. దిన పత్రికతో గాలి విసురుకొంటూ కాఫీ కోసం ఎదురు చూడసాగారు.

లేదు. కాఫీ జాడే లేదు....!

చటుక్కున గుర్తొచ్చిందాయనకు. ఆ మూడు వందల రూపాయల వెంకటగిరిచీర దాని కోసం ప్రొద్దుట దెబ్బలాడలేమా కామేశ్వరి ? ఇల్లిల్లు తిరిగి వాయిదాలపద్ధతి మీద చీరలమ్మే ఆ భద్రమ్మ మగవాళ్ళ పాలిట శని !

అవునో కాదో అనేంతటి పల్చని నవ్వొకటి విరిసింది. హెడ్‌మాస్టర్‌గారి ముడతలు పడిన పెదవులమీద. మెల్లగా లేచి వంటింటికి వెళ్ళి "ఒసే" అని పిలిచారు.

ఓ పీటను తలగడగా వేసుకొని ముడుచుకుపడున్న ధర్మపత్నిమాట్లాడలేదు. "ఆ చీరేదో కావాలన్నావు కదూ? ఇదిగోవంద. తరువాత నెలకు ఇరవై చొప్పున ఇస్తే చాలు కదూ?...."

కాఫీ కోసం కుంపటిమీదనీళ్ళు పడేసింది కామేశ్వరమ్మ.

"కృష్ణారావు నెలకు 50 రూపాయలు పంపుతానన్నాడు. పరంధామయ్యకు తప్ప ఇంకెవరికీ ఈ విషయం తెలియదు....ఆ యాభైలో 20 భార్యకు....30రమణమ్మకు.. బాగానే వుంది..." అనుకొన్నారు. వేగంగా గాలి విసురుకొంటూ హెడ్‌మాస్టారు.

కాఫీ తాగి. పరంధామయ్యకు మూడు వందలిచ్చి. మిగిలిన రెండు వందలతో రమణమ్మ ఇంటికెళ్ళారు హెడ్‌మాస్టారుగారు. అక్కడ పేరయ్య ఆవిడతో మాట్లాడుతున్నాడు. అతని ముఖం వెలిగిపోతున్నది. హైదరాబాదు సంబంధానికి జానకి ఒప్పుకున్నది. రెండువైపులనించీ గుంజ వచ్చని అతనికి మహదానందంగా వుంది. సంబంధం వివరాలన్నీ అతనే హెడ్ మాస్టరుగారికి చెప్పాడు.

డబ్బిచ్చి ఇంటికి తిరిగొస్తూ. 'పాపం జానకి ! కృష్ణారావు దక్కనప్పుడు ఎవరైతేనేం అని మనసు రాయి చేసుకుని ఈ సంబంధానికి ఒప్పుకొనుంటుంది. కాని. ఏ మాటకామాటే! ఒక్క పిసరు గొడవ చెయ్యలేదట ఆ పిల్ల. కృష్ణారావే ఆ మాట చెప్పాడుగా. బండి ఎక్కే ముందు. అతన్నినవ్వుతూ సాగనంపిందట. ఉంటారు త్యాగమూర్తులు....' అనుకొన్నారు హెడ్ మాస్టరుగారు.

* * *

పొలం గట్టున కూర్చుని సుబ్బారావు ఆలోచిస్తున్నాడు. ఇప్పుడే చాకలిజంగయ్య ఎదురయ్యాడు — "ఇదిన్నారా బాబూ ? పంతులు బాబుగోరు ఎల్లిపోతున్నారంట" అంటూ. అయితే. కృష్ణారావు మాట నిలబెట్టుకొన్నాడన్నమాట. "కాని బాబూ. ఆ జానకమ్మను చేసుకోరంట. ఎందుకైయుంటుంది బాబూ? పాపం. శానా చనువుగుండేవోరు. పంతులుగారి మాసిన బట్లు ఆయమ్మే నాకు యేసి పద్దు రాస్కునేది.... ఏమైందో మరి...." అంటూ బుర్ర గోక్కుంటూ వెళ్ళాడు.

సుబ్బారావుకి ఎవరో తలమీద బాదినట్టైంది. "నిజమేకదూ? వాళ్ళ స్నేహం. చనువు ఎంతదూరం వెళ్ళిందో ఎవరు చూశారు ? వూరందరి వూహకు వదిలిన విషయం అది....ఆడపిల్లలకు అందంకంటే శీలమే ప్రధానం....జానకి కంటే సీతను చేసుకోవడమే మంచిదేమో .... చాలా అణుకువైన పిల్ల అని సీతకు పేరుంది....

"కాని తనే వెళ్ళి సీతను చేసుకుంటాను అంటే లోకువకదా? జానక్కి పెళ్ళి అయ్యేదాకా వూరుకోవాలి. తరువాత రమణమ్మత్తయ్య సీత గురించి అడగకుండావుండదు. అప్పుడు పెద్దావిడ మాట తీసెయ్యలేక ఒప్పుకుంటున్నట్టు నటిస్తే మంచి పేరూ వస్తుంది. కట్న కానుకలు కూడా రాబట్టవచ్చు...." అని నిర్ణయించుకుని. లేచాడు సుబ్బారావు.

అతని అంచనా తప్పు కాలేదు. జానకికి పెళ్ళయిన నెలకు సుబ్బారావునిసీత గురించి కదిపింది రమణమ్మ. అతను ఒప్పుకున్న తరువాత ఇరుగు పొరుగు స్నేహితురాళ్ళతో "మన సుబ్బారావు రత్నంలాంటి వాడమ్మా. జానకిని ఇవ్వలేదని ఏమైనా కోపం వుంచుకున్నాడా?! అత్తయ్య మీద జాలిపడి మన సీతను చేసుకొంటున్నాడు. కోటికొక్కడుంటారుఇలాంటివాళ్ళు ఈ కలియుగంలో" అంటూ మురిసిపోయింది రమణమ్మ.

కాదుమరి? సత్య పురుషుడిదేం గొప్ప? కలిపురుషుడూ చేయించటంలేదూ త్యాగాలు?

